పాడితో బతుకు పంట



ఓ వైపు వ్యవసాయం చేస్తూనే ప్రత్యామ్నాయంగా ఎక్కువ మంది రైతులు పాడి వైపు దృష్టిసారిస్తున్నారు. ఇంటికి నాలుగైదు పశువులను పెంచుకుంటూ తద్వారా వచ్చిన పాలను విక్రయిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా బీమా, టీకాలు, పశువుల దాణాకు అన్ని విధాలా అండగా నిలుస్తుండటంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఖర్చు తక్కువ ... ఆదాయం ఎక్కువ
- పాలు అమ్ముతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న రైతులు
- బీమా, టీకాలు, ఎరువులతో దన్నుగా నిలుస్తున్న ప్రభుత్వం

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లోని ఒక్కో గ్రామంలో 25 నుంచి 40 పాడి ఆవులకు పైగా రైతులు పెంచుతున్నారు. రోజూ పాలను డెయిరీకి పోసి దాని ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. పాడి ఆవుల పెంపకం కోసం ప్రత్యేకంగా షెడ్డును కూడా ఏర్పాటు చేసుకుని ఆవులను సంరక్షిస్తున్నారు. అలాగే నీటి వసతి కలిగిన ఎక్కువ శాతం మంది రైతులు పాడి ఆవుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభిస్తే...

రొళ్లలో పాడి రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పాల శీతల కేంద్రం ఐదేళ్ల క్రితం మూత పడింది. టీడీపీ ప్రభుత్వంలో పాడి పోషణను నిర్లక్ష్యం చేయడంతోనే రైతులకు గడ్డుకాలం ఎదురైందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక సమీపంలోని కర్ణాటక ప్రాంతంలో ఉన్న ప్రైవేట్ డెయిరీకి పాలను పోసి దాని ద్వారా ఆదాయం పొందుతున్నారు. స్థానికంగా ఉన్న పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభిస్తే స్థానిక రైతులకు మరింత ఆదాయం పొందే వీలుంటుందని, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

రోజుకు రూ.1250 వరకూ ఆదాయం

రొళ్ల మండలంలోనే 3,300 లీటర్ల నుంచి 4100 లీటర్ల వరకు పాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేటు డెయిరీకి లీటరు పాలను రూ.38 నుంచి రూ.42 వరకు చొప్పున పోస్తున్నారు. అయితే పాల నాణ్యత సక్రమంగా ఉంటే లీటరు పై మరింత అదనంగా బిల్లులు కూడా పొందుతున్నారు. రెండు ఆవుల పెంపకం చేపట్టిన రైతులు రోజుకు 25 నుంచి 30 లీటర్ల పాలను ఉదయం, సాయంత్రం పొయడం వల్ల రోజుకు రూ.1100 నుంచి రూ.1250 వరకు ఆదాయం పొందుతున్నారు. దాణాతో పాటు ఔషధాలు ఇతరాత్ర ఖర్చులు పోగా నెల రూ.17 వేల నుంచి రూ.21 వేలకు పైగా స్థానికంగానే లాభం పొందుతున్నారు.

పాడి ఆవులు, గేదెల వివరాలు

మండలం	ఆవుల సంఖ్య	గేదెల సంఖ్య	మొత్తం జీవాల సంఖ్య
రొళ్ల	6,103	3,458	9,561
అగళి	5,813	3,904	9,717
గుడిబండ	4,548	2,659	7,207
అమరాపురం	6,356	5,607	11,963
మడకశిర	9,997	6,190	16,187

నెలకు రూ.18 వేలకు పైగా...



వ్యవసాయం కన్నా పాడి ఆవుల పెంపకం ద్వారానే ఎక్కువ ఆదాయం పొందుతున్నాం. ప్రస్తుతం మూడు పాడి ఆవులను పెంచుతున్నా. లీటరు రూ.40 చొప్పున రోజూ 30 లీటర్ల పాలను ప్రైవేటు డెయిరీకి పోస్తున్నాం. ఖర్చులన్నీ పోగా నెలకు రూ.18 వేలపైగా ఆదాయం వస్తుంది. స్థానికంగా డెయిరీ ఏర్పాటు చేస్తే పాడి రైతులకు మరింత మేలు జరుగుతుంది.

– జి.రాజు, పాడి రైతు, కాకి, రొళ్ల

ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం



పాడి ఆవులు పెంపకంతో కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకుంటున్నాం. ప్రస్తుతం నాలుగు పాడి ఆవులను పెంచుకుంటున్నా. రోజూ 40 లీటర్ల పాలు పోస్తున్నా. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లు రూపంలో రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదాయం పొందుతున్నాం. ఇతరాత్ర వ్యవసాయం సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లేది. ప్రస్తుతం పాడి పోషణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం.

– గోవిందరాజు, పాడి రైతు, గుడ్డగుర్కి, రొళ్ల

క్రమం తప్పకుండా టీకాలు



పాడి ఆవులు పెంచి పోషిస్తున్న రైతులు వ్యాధుల నివారణ కోసం ఎప్పటికప్పుడు టీకాలు, ముందు జాగ్రత్తగా మందులను తప్పని సరిగా వేయించాలి. దీనివల్ల పశువుల మరణాలు కూడా తగ్గేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం పశు పోషణ పథకం కింద ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఆవులకు రూ.384, గొర్రె లేక మేకలకు రూ.36 రైతు వాటా కింద ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లలోపు ఆవు మృత్యువాత పడితే రూ.15 వేలు, గొర్రె, మేకలకు రూ.6 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు.

– మాధవి, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, రొళ్ల

క్లుప్తంగా

సోమందేపల్లి వాసి అయోధ్యలో మృతి



రంగప్ప (ఫైల్)

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరులో నివాసముంటున్న రంగప్ప (65) అయోధ్యలో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం కొంత మంది విహారయాత్రకు వెళ్లగా.. వారికి వంట చేసేందుకు రంగప్పను తీసుకెళ్లారు. అయితే ఉన్నట్టుండి గుండెపోటుకు గురి కావడంతో రంగప్ప చనిపోయారు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రావడానికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యకు బయలు దేరి వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలి

సోమందేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేనేత సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు చాంద్ బాషా, గంగరాజు, శ్రీకాంత్ లక్ష్మీనారాయణ, బాలస్వామి పాల్గొన్నారు.

'పురం'వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉమర్ ఫరూఖ్

హిందూపురం: పట్టణానికి చెందిన సామాజిక సేవాకర్త, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్ రాజర్షిసాహు ప్రేరణ జాతీయ అవార్డు అందుకున్నారు. ఆదివారం మహారాష్ట్ర కోల్హాపూర్ దమ్మభవన్ చారిటబుల్ ట్రస్టు సమత నగరంలో రాజశ్రీ నేషనల్ చిల్డ్రన్స్ షార్టు ఫిలిం ఫెస్టివల్‌లో రాజర్షి సాహు ప్రేరణ జాతీయ పురస్కారాన్ని ట్రస్టు అధ్యక్షుడు కరుణ విమల్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. సామాజిక విద్య, రాజకీయ ప్రజా సేవా రంగాల్లో చేస్తున్న సేవలకుగాను జాతీయ అవార్డు దక్కిందన్నారు.

వీఆర్‌కు రొళ్ల ఎస్ఐ

రొళ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న ఎన్.వెంకటరమణను వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న కె.బాబాజాన్ రొళ్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

మూర్ఛవ్యాధిపై అపోహలొద్దు



మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: మూర్ఛవ్యాధిగ్రస్తులు అపోహలు వీడి మందులు వాడుతూ వైద్యుల సలహాలు పాటిస్తే వ్యాధి నయమవుతుందని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో 117వ ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 147మంది రోగులను పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందించారు. డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ మూర్ఛవ్యాధిగ్రస్తులు వివాహానికి, ఉద్యోగానికి , సంసారానికి పనికిరారని చెప్పడం అవివేకమన్నారు. వారందరూ ఆరోగ్యవంతులేనన్నారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రామకృష్ణ, ఉగ్రప్ప, నాగేంద్రచారి, రవీంద్రరెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పెనుకొండ: పట్టణంలోని మారుతీనగర్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... మారుతీనగర్‌లో జూదం ఆడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. జూదరుల నుంచి రూ. 4070 స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అమరాపురం: రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి నుంచి వచ్చిన డాక్టర్లు సుష్మిత, షైనా బన్సాల్, నిశ్చల్, ప్రొఫెసర్లు ఆనంద్, సందీప్, దర్శన్ రోగులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించారు. రోగులకు వివిధ పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు మందులు అందజేశారు. 15 మంది రోగులను గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ బసవరాజు పద్మరాజ్‌జైన్ తెలిపారు. మొత్తం 350 మంది వివిధ రోగులకు పరీక్షించినట్లు పేర్కొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 264 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు సుధాకర్ తెలిపారు.

మరువకు తాత్కాలిక మరమ్మతు



దెబ్బతిన్న చెరువు మరువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండలంలోని రొద్దం పెద్దచెరువుకు తాత్కాలిక మరమ్మతు చేపడుతున్నట్లు ఇరిగేషన్ ఇన్‌చార్జ్ డీఈ, జేఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. గత ఏడాది భారీవర్షాలకు చెరువు మలుమార్లు పెద్ద ఎత్తున మరువ పారడంతో మరువ పూర్తిగా ధ్వంసమైందన్నారు. చెరువు ఆయికట్టు రైతులు మరువ పరిస్థితులను ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. మళ్లీ వర్షాలు పడితే మొత్తం మరువ తెగిపోతుందని చెప్పినట్లు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శంకరనారాయణ మరువకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించడంతో ఆదివారం మరమ్మతు పనులు ప్రారంభించినట్లు జేఈఈ తెలిపారు. అదేవిధంగా చిన్నకోడిపల్లి, కందకూర్లపల్లి గ్రామాలకు వెళ్లడానికి చెరువు కట్టపై కంపచెట్లు పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇందులో భాగంగానే ఇరువైపులా పేరుకు పోయిన కంప చెట్లను జేసీబీ ద్వారా తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు నరసింహులు, రాము తదితరులు ఉన్నారు.

చెట్టంతా పూలే..



అమరాపురం: మండలంలోని నిద్రగట్ట, హాలుకూరు తదితర గ్రామాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న చిన్న కేసరి చెట్లకు పూలు విరబూశాయి. చెట్టులో ఆకు కనబడకుండా పూలతో నిండిపోవడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

మడకశిర ఎస్ఐగా ఇషాక్‌బాషా

మడకశిర: మడకశిర ఎస్ఐగా ఇషాక్‌బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న సురేష్ బాబు మెడికల్ లీవ్‌లో వెళ్లారు. ఈ నేపథ్యంలో కదిరి అర్బన్ పీఎస్‌లో పని చేస్తున్న ఇషాక్‌బాషాను మడకశిర ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.



ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	34.0
పెనుకొండ	38.0
మడకశిర	34.0

విద్యుత్ వినియోగదారుల వివరాలు నమోదు చేసుకోండి

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లోని వ్యవసాయ విద్యుత్ సర్వీస్ వినియోగదారులు బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్‌ను ఏఈల వద్ద నమోదు చేసుకోవాలని ఏడీఏ సుబ్రహ్మణ్యప్రసాద్ తెలిపారు. నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీని ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. వివరాలు నమోదు చేసుకోకపోతే బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సర్వీస్ వినియోగదారులు తప్పనిసరిగా బ్యాంకు, ఆధార్ నంబర్‌ను నమోదు చేసుకొని ప్రభుత్వ సబ్సిడీని పొందాలన్నారు.

మార్కుల జాబితా ప్రదర్శన

హిందూపురం టౌన్: సీ.చెర్లోపల్లిలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు ఆధార్ కార్డు, 5వ తరగతికి సంబంధించిన స్టడీ సర్టిఫికెట్ తీసుకుని పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం



వనజను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట గ్రామంలో నివాసం ఉంటున్న వనజ ఈ నెల 12న అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఎస్ఐ వెంకటరమణ వివరాల మేరకు... వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం నంద్యాలంపల్లికి చెందిన లేట్ లక్ష్మీకాంత్ రామతులసమ్మ కుమార్తె వనజ అన్నారు. హొట్టేబెట్టలో తన మేనత్త నాగమ్మ ఇంట్లోనే ఉండి హొట్టేబెట్ట ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించేదన్నారు. అయితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఇటీవల సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాసిందన్నారు. అయితే ఈ నెల 12న ఇంటి నుంచి బయటికి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా వనజ కర్ణాటక రాష్ట్రం కొరటగెర తాలూకా అశాలసంద్రలోని బంధువుల ఇంట్లో ఉందని గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థి వనజను ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో చేరితే సైకిల్ ఫ్రీ



విద్యార్థికి ఉచిత సైకిల్ అందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన వదనకల్లు గ్రామంలోని తిప్పేరుద్రస్వామి ఉన్నత పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. తమ పాఠశాలలో 8 ,9, 10 తరగతుల్లో చేరే విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లతో పాటు పాఠ్య పుస్తకాలు, సైకిళ్లు కూడా ఉచితంగా అందిస్తామని ఆ పాఠశాల సమితి కార్యదర్శి కొత్తూరు హనుమంతరాయప్ప తెలిపారు. చుట్టుపక్కన చాలా గ్రామాల్లోని విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించడంతో పాటు స్కూల్‌కు వచ్చేందుకు ఇబ్బంది పడకుండా సైకిళ్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 13 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలకు నిర్ధేశించిన సీట్లు పూర్తయ్యేంత వరకూ ఎంతమంది విద్యార్థులు చేరినా వారికి సైకిళ్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు జయరామరెడ్డి, ఉపాధ్యక్షుడు హనుమక్క కెంచప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు





రొళ్ల , అమరాపురంలో పూజలందుకున్న సిద్ధేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. విశేష పూజ రోజు కావడంతో స్వామిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గుడిబండ మండలం సీసీ గిరి, కర్ణాటక రాష్ట్ర జీడీ పాళ్యం గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై వంటకాలు చేసి అన్నదానం చేశారు.

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు అమవాస్య కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించారు.

నేటి కార్యక్రమాలు

'స్పందన'

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమానికి డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులు దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయం – 2 పరిధిలోని గౌడనకుంట గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారని పేర్కొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'

రొళ్ల: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలో 2022–23 విద్య సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం రొళ్ల సమీపంలోని దొమ్మరహట్టి గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే తిప్పేస్వామి చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామీణ ప్రగతి పరుగులు

- ఉన్న ఊర్లోనే సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం
- వ్యయ ప్రయాసలు తగ్గాయంటున్న గ్రామీణులు



దేవరహట్టిలోని రైతు భరోసా కేంద్రం

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుండటంతో పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తోంది. గతంలో ఏచిన్న పనికైనా పనులు మానుకుని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామంలోనే అన్ని పనులు నెరవేరుతుండటంతో వ్యయ ప్రయాసలు తగ్గాయని గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ముగింటకే పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యం

జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. 2019లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. పంటల సాగుకు పెట్టుబడి సాయం నుంచి మద్దతు ధర, పంట విక్రయించేందుకు అండగా నిలుస్తున్నారు. ఉన్న ఊర్లోనే సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని గుడిబండ, మడకశిర, అమరాపురం , రొళ్ల, అగళి మండలాల పరిధిలో 76 సచివాలయాలు, 70 రైతు భరోసా కేంద్రాలు, 30 పైగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తుండటంతో గ్రామాల్లోనే దాదాపుగా ప్రజలు, రైతుల పనులు పూర్తవుతున్నాయి.

వ్యయ ప్రయాసలు తగ్గాయి



గ్రామంలోనే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కూడా అందిస్తున్నారు. గతంలో పనులు మానుకొని ప్రతి చిన్న పనికీ మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా అన్ని సేవలు తమ స్వంత గ్రామంలోనే పొందుతున్నాం.

– మాలింగప్ప, రైతు, మోరుబాగల్

ప్రజల వద్దకే పాలన



సీఎం జగన్ ఆధ్వర్యంలో గ్రామంలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సేవలతో పాటు ఇంటి వద్దకే ఫించను, బియ్యం అందిస్తున్నారు. ఆర్బీకే ద్వారా విత్తనాలు, ఎరువులు అన్ని రకాల మందులు లభిస్తుండటంతో గ్రామం దాటి వెళ్లాల్సిన అవసరమే లేకుండా పోయింది.

– నాగరాజు, రైతు, గుడ్డంపల్లి

'బక్రీద్'ను ప్రశాంతంగా నిర్వహించుకోండి

పావగడ: బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ గురుమూర్తి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన శాంతి సభలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా చేపట్టే ఊరేగింపును పోలీస్ గైడ్ లైన్స్ ప్రకారం నిర్వహించాలన్నారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉండాలన్నారు. అందరి దేవుళ్లూ సూచించేది శాంతి మార్గమేనన్నారు. ఈ సభలో స్థానిక జామియా మసీదు ముతవల్లి లతీఫ్ సాబ్, కార్యదర్శి మహ్మద్ జావీద్, ట్రెజరర్ షమీవుల్లా, సభ్యులు షా బాబు, కలీముల్లా, నవాబ్, అర్షీ ఖాన్, రిజ్వాన్ ఉల్లా, సాధిక్, ఇదాయత్, నిసార్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

మడకశిరరూరల్: మండలంలో బోరు బావుల కింద రాగి పంట సాగు చేసే రైతులు రాగి విత్తనాల కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తిమ్మప్ప తెలిపారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో ఇంద్రావతి రకం రాగి విత్తనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50 మందికి పైగా అన్నదాతలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. రైతులు ఆలస్యం చేయకుండా ఆర్బీకేల్లో వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నాలుగు కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.278 కాగా రాయితీ రూ.139 పోనూ రైతులు కేవలం రూ.139 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.